పది నెలల పాలనలో.. పదేండ్లు వెనక్కి..

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పక్కన ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల , తదితరులు

- హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- రైతుల సమస్యల పరిష్కారం కోసం 12న పాదయాత్ర
- పాదయాత్రకు మద్దతుగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాక
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల
- రాఘవపేటలో పార్టీ శ్రేణులతో సమావేశం

మల్లాపూర్, నవంబర్ 8: కాంగ్రెస్ సర్కారు హామీల అమలులో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు పది నెలల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పదేండ్ల వెనక్కి వెళ్లిందన్నారు. రాఘవపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం ఆయన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, రుణమాఫీ, రైతుభరోసా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఏనాడు సంక్షేమ పథకాలను ఆపలేదని స్పష్టం చేశారు. రైతులకు వందశాతం రుణమాఫీ చేస్తానని అన్ని దేవుళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టేసి మాట తప్పాడన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, రైతుల సమస్యల పరిష్కారం కోసమే ఈ నెల 12న కోరుట్ల పట్టణం నుంచి జిల్లా కేంద్రం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రకు అన్ని గ్రామాల నుంచి పార్టీలకతీతంగా రైతులు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ పాదయాత్రకు మద్దతుగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి సరోజన, ఏఎంసీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్లు వేంపేట నర్సారెడ్డి, నేరెళ్ల మోహన్‌రెడ్డి, బద్ధం అంజ రెడ్డి, ఆర్‌బీఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ దేవ మల్లయ్య, మాజీ మండలాధ్యక్షుడు జీవన్ రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నగేశ్, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



వేంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడ్పుల పుష్పలత

మల్లాపూర్, నవంబర్ 8: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడ్పుల పుష్పలత కోరారు. మండలంలోని వాల్గొండ, వేంపల్లి, వెంకట్రావుపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండ అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, సీసీలు లక్ష్మి రాజం, రాజు, కిసాల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ సీసీకి షోకాజ్ నోటీసు

కథలాపూర్, నవంబర్ 8: కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని ఐకేపీ సీసీ రాజేందర్‌కు కలెక్టర్ సత్యప్రసాద్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్ శుక్రవారం బొమ్మెన గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులు సరిగ్గా లేవని కలెక్టర్ గుర్తించి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఏపీఎం అంజయ్య తెలిపారు.

పశు వైద్య శిబిరం

పెగడపల్లి, నవంబర్ 8: రాజారాంపల్లి గ్రామంలో శుక్రవారం మండల పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి హేమలత తెలిపారు. పశువైద్య సిబ్బంది షాదుల్లా, మతిన్, వినీత్, జానీపాషా, నర్సయ్య, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల/జగిత్యాలరూరల్, నవంబర్ 8: మండలంలోని పొలాస, గుల్లపేట, వ్యవసాయ కళాశాల, లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్, అనంతరాం రొడ్డాం గ్రామాలకు శనివారం మధ్యాహ్నం 3.30 నుంచి 5.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ సుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని తులసీనగర్, ఇస్లాంపుర, గాంధీనగర్, ఇంద్రానగర్, నిజామాబాద్ రోడ్, ఖిల్లాగడ్డ, తీన్‌ఖానీ, రహమత్ పుర, దగులమ్మ ఏరియా, ప్యారబై స్ట్రీట్, ఈద్గా, తెనుగువాడ, ఉప్పరిపేట, గీత విద్యాలయం, బీట్ బజార్, వాణినగర్, హౌసింగ్ బోర్డు, శ్రీనగర్ కాలనీ, రాజేశుని గుట్ట, ఎలుకబావి ఏరియాలకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎండీ రహీం తెలిపారు. చల్‌గల్, మోరపల్లి, చర్లపల్లి, మోతె, వెల్దుర్తి, గొల్లపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. అలాగే, టీఆర్‌నగర్, దరూర్, నర్సింగాపూర్, వంజరిపల్లి గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సారంగాపూర్/కోరుట్ల/మల్యాల/కథలాపూర్, నవంబర్ 8: సారంగాపూర్ మండలం రేచపల్లి, ఒడ్డెరకాలనీ, రంగపేట, లచ్చనాయక్‌తండా, మ్యాడారం తండా, భీంరెడ్డి గూడెం, సారంగాపూర్, పోతారం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోరుట్ల పట్టణంలోని అన్ని ప్రాంతాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శ్యాం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మద్దుట్ల, కొండగట్టు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొడిమ్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. కథలాపూర్ మండలం సిరికొండ, కథలాపూర్, పోసానిపేట, దూలూర్, దుంపేట గ్రామాలకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దివాకర్‌రావు తెలిపారు.

కథలాపూర్: సిరికొండ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధాన్యం మిల్లులకు తరలించాలి

మేడిపల్లి, నవంబర్ 8: తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. భీమారం మండలం మన్నెగూడెం, మేడిపల్లి మండలం దమ్మన్నపేట, వల్లంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం తూకం వేయాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, డీఆర్డీవో రఘువరన్, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా మేనేజర్ జితేందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సురేంద్రకుమార్, తహసీల్దార్లు వసంత, రవికిరణ్, ఎంపీడీవో పద్మావతి, ఎంపీవో నీరజ, ఏపీఎం గట్ల అశోక్, ఏవో షాహిద్ అలీ, ఏఈవోలు సురేందర్‌నాయక్, మంజుల, సింగిల్‌విండో సీఈవో తొర్తి గోపి తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్, నవంబర్ 8: కథలాపూర్, సిరికొండ, బొమ్మెన గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. కేంద్రాల్లోని ధాన్యం తేమ శాతం పరిశీలించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైతులు తదితరులున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సారంగాపూర్, నవంబర్ 8: వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు. శుక్రవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని స్టేషన్‌కు తరలించి, బియ్యం తరలిస్తున్న పూడూర్‌కు చెందిన ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇకపై తెలుగులో వ్యవసాయ విద్యుత్ అంచనాలు

జగిత్యాల, నవంబర్ 8: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొందే రైతులకు ఇకపై సమాచారాన్ని తెలుగులో తెలుసుకునే వెసులుబాటును ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను జగిత్యాల సర్కిల్ ఎస్ఈ సాలియా నాయక్ వివరించారు. సాధారణంగా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో కొత్త విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్‌కు సంబంధించిన ఇతర పనులు చేపట్టేందుకు అధికారులు అంచనాలు (ఎస్టిమేట్లు) రూపొందిస్తారు. ఇందులో పని వివరాలు, వాటికి అవసరమైన సామగ్రి, మెటీరియల్, పనిచేసే ప్రదేశం వివరాలన్నీ ఉంటాయి. ఇప్పటి వరకు ఈ ఎస్టిమేట్లు ఇంగ్లిష్‌లో రూపొందిస్తున్నారు. దీంతో ఆ పనికి సంబంధించిన సమాచారం, మెటీరియల్ వివరాలు రైతులకు తెలియడంలేదు. దీంతో ఎస్టిమేషన్లు తెలుగులోనే అందించాలని రైతులు విద్యుత్ అధికారులకు విన్నవిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సులభంగా అర్థమయ్యేలా అంచనాలు, మెటీరియల్, అవసరమైన సామగ్రి వివరాలతో పూర్తి సమాచారాన్ని తెలుగులోనే అందించేలా ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఈ తెలిపారు. రైతుల సెల్‌ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లో ఉండే లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా కూడా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నా రు. విద్యుత్ అధికారుల పొలంబాటలో భాగంగా వంగిన స్తంభాలు, లూజ్ లైన్ల ను సరిచేయడంతోపాటు కెపాసిటర్లు బిగించుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా ఇబ్బందులుంటే రైతులు టోల్‌ఫ్రీ నంబర్ 1912లో సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు.

వైభవంగా గోదావరి హారతి

గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబర్ 8: కార్తీక మాసం ఏడో రోజు శుక్రవారం గోదావరి మాతకు హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి మేళతాళాల మధ్య గోదావరి నది వరకు పండితులు, అర్చకులు, భక్తులు హరినామస్మరణ సంకీర్తనల మధ్య శోభాయాత్రగా చేరుకున్నారు. గోదావరి పుష్కరఘాట్లపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద పండితులు మంత్రోచ్చరణలతో గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, భక్తులతో కలిసి గోదావరి నదికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితుడు బొజ్జ రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, శారదా, వాసవీ మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

మల్యాల, నవంబర్ 8: మల్యాల, కొడిమ్యాల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం దిగుమతి చేసుకోవడంలో రైతులకు ఇబ్బంది పెట్టవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైస్‌మిల్లర్లకు సూచించారు. నాచుపల్లిలోని జేఎన్‌టీయూ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల నుంచి పంపిన ధాన్యం వెంటవెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మునీందర్, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, పౌరసరఫరాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం, పక్కన అదనపు కలెక్టర్ లత

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

మల్యాల, నవంబర్ 8: మల్యాల ఎక్స్‌రోడ్‌లోని ఎన్ఎస్‌వీ పాఠశాల విద్యార్థులు ఇటీవల పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. విద్యార్థులు అక్షయ, అఖిల్, అశ్వత్తామ, అక్షిత్, సాత్విక్, శశాంక్, షర్మిల, మనస్వి, శ్రీచరన్‌ను అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేంధర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ మర్రిపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల, నవంబర్ 8: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జగిత్యాల లోని ప్రజ్ఞ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు దుగ్యాల రాఘవ్‌రావు, హేమ హాసిని, శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి గౌతమ్, ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్ విద్యార్థి అఖిల్, మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి జాహిద్ ఎంపికయ్యారు. జగిత్యాల యువజన క్రీడా ప్రాంగణంలో విద్యార్థులను శుక్రవారం జిల్లా యువజన క్రీడల అధికారి డాక్టర్ రవికుమార్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు నవీన్‌కుమార్, వంశీకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్యాల (కొడిమ్యాల), నవంబర్ 8: కొడిమ్యాల మండలం నమిలకొండకు చెందిన జెస్సీ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. విద్యార్థిని ఎంఈవో అయిత శ్రీనివాస్ అభినందించారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

జగిత్యాల, నవంబర్ 8: జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులు, సిబ్బందికి సూచించారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి, జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లో శుక్రవారం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల రూరల్ మండల ప్రత్యేకాధికారి నరేశ్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, తహసీల్దార్, శ్రీనివాస్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

రాయికల్, నవంబర్ 8: రామాజీపేటలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు విద్యార్థి ఎంపిక

అక్షయ్

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 7: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బబ్బిలి అక్షయ్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కొమురయ్య శుక్రవారం తెలిపారు. అక్షయ్‌ని హెచ్ఎం నర్సాగౌడ్, ప్రయోగిల్లు వ్యవస్థాపకుడు ప్రవీణ్ అభినందించారు.

ఎమ్మెల్యే కృషితోనే నిధుల మంజూరు

కోరుట్ల రూరల్, నవంబర్ 8: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కృషితో రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ శ్రేణులు తెలిపారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఓటరు నమోదు కార్యక్రమం

కోరుట్ల రూరల్, నవంబర్ 8: మండలంలోని పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారాల్లో ఓటు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తహసీల్దార్ కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

జగిత్యాల, నవంబర్ 8: జగిత్యాలకు చెందిన సాయి మధుకర్ 'సింథసిస్, బయోలాజికల్ ఆక్టివిటీ అండ్ డాకింగ్ స్టడీ ఆఫ్ ఆక్సాడయోజోలిల్ థయోఫిన్ అండ్ అరైల్, థయడైజోలిల్ ఆరైల్ డెరివేటివ్స్' అంశంపై రసాయన శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ దోమల పర్యవేక్షణలో పరిశోధన చేశారు. కాగా, నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. సాయి మధుకర్‌ను ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరిగెల అశోక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు సురేందర్, రాజు, గోవర్ధన్, శ్రీనివాస్, బోధేతర సిబ్బంది అభినందించారు.

జ్వరంతో బాలిక మృతి

రాయికల్, నవంబర్ 8: రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఉషకుల నిత్యశ్రీ (9) జ్వరంతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

మెట్‌పల్లి డీఎస్పీగా రాములు

మెట్‌పల్లి, నవంబర్ 8: మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాములు నియమితులయ్యారు. ఉమామహేశ్వర్‌రావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, అదే విధంగా ములుగు జిల్లా డీసీఆర్‌బీలో డీఎస్పీగా పనిచేస్తున్న రాములును మెట్‌పల్లికి బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

కోరుట్ల రూరల్, నవంబర్ 8: అయిలాపూర్‌లో కరీంనగర్‌లోని మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో గౌడ సంఘ సభ్యులకు శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. వైద్యులు 120 మందికి వివిధ పరీక్షలు చేసి, అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఇక్కడ వైద్యుడు హర్షిత్ వైద్య, సెంటర్ హెడ్ కిరణ్, కరుణాకర్, చంద్రశేఖర్, సాయితేజ, గంగాధర్‌గౌడ్, రాజనర్సయ్య, అశోక్, రాజలింగం గౌడ్, ప్రసాద్, తదితరులున్నారు.

మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

మల్యాల(కొడిమ్యాల), నవంబర్ 8: కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మడేలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సహకార సంఘం అధ్యక్షుడు రాజనర్సింగరావు, రజక సంఘం నాయకులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఐతుపల్లి కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

పెగడపల్లి, నవంబర్ 8: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని ఐతుపల్లి, నామాపూర్, బతికపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ రాజశేఖర్, ఆర్ఐ శ్రీనివాస్, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రసాద్

జగిత్యాల రూరల్, నవంబర్ 8: కండ్లపల్లి మోడల్ స్కూల్లో శుక్రవారం జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రసాద్ హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శారదాదేవి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్రమోహన్, ప్రెసిడెంట్ ఆఫ్ బార్ అసోసియేషన్ లక్ష్మారెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామాగౌడ్

మల్లాపూర్, నవంబర్ 8: సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యంపేట గ్రామానికి చెందిన గొల్లపల్లి రామాగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరశురాం గౌడ్ శుక్రవారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రామాగౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మిక సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం 1617 దరఖాస్తులు

పెగడపల్లి, నవంబర్ 8: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం 1617 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయానికి పంపినట్లు వివరించారు. దరఖాస్తులకు సంబంధించిన జాబితాను ఈనెల 20న తహసీల్ కార్యాలయం వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వీటిపై ఈ నెల 23 నుంచి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 30న ఫైనల్ జాబితాను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

ఆచరణతోనే సత్ఫలితాలు సాధ్యం

జగిత్యాల టవర్ సర్కిల్, నవంబర్ 8: నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెడితేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్ నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల ప్రభుత్వ బాలికల కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ధ్యాన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా మంచాల కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సి